

సాక్షి బాపట్ల

ఆదివారం । 12 । ఫిబ్రవరి । 2023



సాగునీటి సమాచారం


తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 2,423 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 1,126 క్యూసెక్కులు విడుదలయ్యాయి.



పులిచింతలనీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 43.0610 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 3,500 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 2,200 క్యూసెక్కులు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శనివారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

జాతీయ లోక్ అదాలత్‌లో 612 కేసుల పరిష్కారం



నరసరావుపేటటౌన్: జాతీయ లోక్ అదాలత్‌లో 612 కేసులు పరిష్కారం కాగా, కక్షిదారులకు రూ.2.36 కోట్లు పరిహారం కింద లభించిందని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఓ.వెంకట నాగేశ్వరరావు తెలిపారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం అదనపు జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. న్యాయమూర్తులు మూడు బెంచీలుగా ఏర్పడి రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించారు. సివిల్ 36, క్రిమినల్ 89, చెక్ బౌన్స్ 8, డీవీసీ 1, ముందస్తు వ్యాజ్యాలు 16, ద్వితీయ శ్రేణి కోర్టు కేసులు 461 పరిష్కరించిన వాటిలో ఉన్నాయి. కార్యక్రమంలో న్యాయమూర్తులు టి.ప్రవళిక, జె.అంజయ్య, న్యాయవాద సంఘ అధ్యక్షుడు కాకుమాను బాలహనుమంతరెడ్డి, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బీపీ మండల్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని అమరావతి రోడ్డు చిల్లీస్ సెంటర్‌లో ఆదివారం ఉదయం బీపీ మండల్ కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు బీపీ మండల్ కాంస్య విగ్రహ నిర్మాణ కమిటీ కన్వీనర్, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి, కో–కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల మంత్రులు, మాజీ ముఖ్యమంత్రులు, ఎమ్మెల్సీలు, బీసీ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారన్నారు. అనంతరం బీసీల ఆత్మగౌరవ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

గుంటూరులో మిల్లెట్స్ మేళా

గుంటూరు రూరల్: రైతు నేస్తం ఫౌండేషన్ సహకారంతో కర్షక్ సేవా కేంద్రం నిర్వహణలో ఈ నెల 12వ తేదీ గుంటూరు నగరంలోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మెగా మిల్లెట్స్ (చిరుధాన్యాల) మేళా నిర్వహించనున్నట్లు రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఖాదర్‌వలి, మిల్లెట్స్ రాంబాబు తదితరులు పాల్గొని చిరుధాన్యాల గురించి వివరిస్తారన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటి మట్టం శనివారం 559.00 అడుగుల వద్ద ఉంది. ఇది 230.0610 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకు 9,160, ఎడమ కాలువకు 8,807, ఎస్‌ఎల్‌బీసీకి 2,400, వరద కాలువకు 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్ ఫ్లోగా 20,687 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 20,687 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటి మట్టం 835.50 అడుగుల వద్ద ఉంది. ఇది 55.7729 టీఎంసీలకు సమానం.

బాపట్ల మెప్మా పీడీగా అబ్దుల్ ఖాదర్

బాపట్ల: బాపట్ల జిల్లా మెప్మా పీడీగా అబ్దుల్‌ఖాదర్‌ను నియమిస్తూ ఆ శాఖ ఎండీ విజయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ప్రకాశం జిల్లా పీడీగా పని చేస్తున్న అబ్దుల్‌ఖాదర్‌ను బాపట్ల పీడీగా బాధ్యతలు చేపట్టాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం బాపట్ల పీడీ పోస్టు ఖాళీగా ఉండటంతో అబ్దుల్‌ఖాదర్‌ను నియమించారు.

లక్ష్యానికి మించి రుణాలు!

- మూడవ త్రైమాసికంలోనే బ్యాంకుల టార్గెట్లు రీచ్
- ఈ ఏడాది రుణలక్ష్యం రూ.8,843.73 కోట్లు
- డిసెంబర్ నాటికి ఇచ్చిన రుణాలు రూ.9,403.05 కోట్లు
- వ్యవసాయ పంట రుణాలు రూ.3,876.73 కోట్లు
- పరిశ్రమలకు రూ.1565.97 కోట్లు
- పొదుపు మహిళలకు రూ.3,740.96 కోట్లు అందజేత



జిల్లా లీడ్ బ్యాంక్ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: కొత్త జిల్లాలో తొలి ఏడాదే బ్యాంకులు అన్నివర్గాల వారికి పెద్దఎత్తున రుణాలను మంజూరు చేశాయి. 2022–23 ఏడాదికి సంబంధించి రుణ ప్రణాళికను మించి రుణాలు మంజూరు చేశాయి. ముఖ్యంగా ఫైనాన్షియల్ ఇయర్ ముగియకుండానే మూడవ త్రైమాసికంలోనే లక్ష్యాలకు మించడం గమనార్హం. ఆర్థిక సంవత్సరం ముగియడానికి మార్చి వరకు గడువు ఉన్నప్పటికీ బ్యాంకులు అన్ని విభాగాల్లో 106.33 శాతం మేర రుణాలు మంజూరు చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

రుణ పంపిణీ ఇలా..

2022–23కు జిల్లా వార్షిక రుణ ప్రణాళికను ప్రభుత్వం గత మార్చి నెలలో ప్రకటించింది. అన్ని రంగాలకు కలిపి బ్యాంకుల ద్వారా రూ.8,843.73 కోట్ల రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వ్యవసాయ రుణాలకు రూ.3,876.73 కోట్లు ఇవ్వాలని నిర్ణయించగా డిసెంబర్ నాటికి 2,33,555 మంది రైతులకు రూ.3,909.27 (99.16 శాతం) కోట్లు ఇచ్చారు. రాబోయే మూడు నెలల్లో మరింతగా రుణాలు ఇవ్వనున్నారు. భూఅభివృద్ధి, హార్టీకల్చర్, డెయిరీ, పౌల్ట్రీ, ఫిషరీస్, ఫాం మెకనైజేషన్, ఇతర వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.1,110.73 కోట్లు ఇవ్వాలన్నది లక్ష్యం కాగా డిసెంబర్ నాటికి 1,51,994 మందికి రూ.2,730.07 కోట్లు ఇచ్చారు.

ప్రాధాన్యత రంగాలకు..

ఇతర ప్రాధాన్యత రంగాల పరిధిలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు సంబంధించి రూ.1565.97 కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా డిసెంబర్ నాటికి 20,095 మందికి రూ.645.09 కోట్లు రుణాలుగా ఇచ్చారు. వీటితో పాటు విద్య, గృహ నిర్మాణ రంగాలకు పెద్ద ఎత్తున రుణాలు ఇచ్చారు. విద్యా రుణాలకు సంబంధించి రూ.55.69 కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, 1150 మందికి రూ.25.10 కోట్లు అందించారు. గృహ నిర్మాణానికి సంబంధించి ఉమ్మడి జిల్లా టార్గెట్ రూ.338.91 కోట్లు లక్ష్యంకాగా, ఇప్పటివరకూ 933 మందికి రూ.76.22 కోట్లు అందజేశారు. ఇతర ప్రాధాన్యత రంగాలన్నింటికీ కలిపి మొత్తం రూ.7,431.59 కోట్లు లక్ష్యంకాగా 4,32,563 మందికి రూ.7618.17 (102.51 శాతం) కోట్లు ఇచ్చారు. ప్రాధాన్యేతర రంగాలకు సంబంధించి రూ.1412.14 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా డిసెంబర్ నాటికి రూ.1785.33 కోట్ల (126.42 శాతం) రుణాలు అందజేశారు. పొదుపు మహిళలకు సంబంధించి 25,138 గ్రూపులకు రూ.3,740.96 కోట్లు పంపిణీ చేశారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో అన్ని రంగాలకు కలిపి నాలుగు త్రైమాసికాల్లో (12 నెలల్లో) రూ.8,843.73 కోట్లు ఇవ్వాలన్నది లక్ష్యం కాగా, మూడు త్రైమాసికాలు ముగిసేనాటికి (డిసెంబర్) జిల్లాలోని అన్ని బ్యాంకుల పరిధిలో రూ.9,403.05 (106.05 శాతం) రుణాలు అందజేయటం విశేషం. ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మార్చి వరకు గడువు ఉండటంతో పెద్ద మొత్తంలో బ్యాంకులు రుణాలు ఇవ్వనున్నాయి. భూ అభివృద్ధి పనులకు మొదలు మైనర్ ఇరిగేషన్ పరిధిలో బోరుబావులు, పైపులైన్లు, ట్రాకర్స్, యంత్ర పరికరాలు, గేదెలు, గొర్రెలు, పాట్టేళ్లు, షెడ్ల నిర్మాణం తదితరవాటికి బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయి. వీటితో పాటు హార్టీకల్చర్, ప్లాంటేషన్ల ఏర్పాటుకు బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి. డెయిరీ, పౌల్ట్రీ, ఫిషరీస్‌తో పాటు ఇతర వాటికి పెద్ద ఎత్తున రుణాలు మంజూరు చేస్తున్నారు.

బాపట్ల జిల్లాలో మొత్తం బ్యాంకులు	26
వాటి పరిధిలో బ్రాంచ్‌లు	245

మరింతగా రుణాలు మంజూరుకు అవకాశం



ఈ ఏడాది ఇప్పటివరకు లక్ష్యాలకు మించి బ్యాంకుల ద్వారా ప్రజలకు రుణాలు అందించాం. పంట, వ్యవసాయేతర రుణాలు, ప్రాధాన్యత, ప్రాధాన్యేతర రంగాలకు సంబంధించి అన్ని వర్గాలకు పెద్ద ఎత్తున బ్యాంకుల ద్వారా రుణాలు అందజేశాం. ఏడాది పూర్తికాకుండానే మూడవ త్రైమాసికంలోనే టార్గెట్లకు మించి రుణాలు ఇవ్వడం జరిగింది. బాపట్ల కొత్త జిల్లాగా ఏర్పడిన తొలి ఏడాదే లక్ష్యాలకు మించి రుణాలు అందించడం సంతోషంగా ఉంది. మార్చి వరకు గడువు ఉన్నందున మరింతగా రుణాలు మంజూరుచేసే అవకాశం ఉంది.

– కృష్ణానాయక్, ఎల్‌డీఎం, బాపట్ల

అరసం మహాసభలు ప్రారంభం



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ పి.సంజీవమ్మ

తెనాలి: అరసం సంక్షిప్త నామంతో పిలుచుకునే ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం 80వ వార్షికోత్సవాలు, 19వ రాష్ట్ర మహాసభలు ఆంధ్రా ప్యారిస్ తెనాలిలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో రెండు రోజుల పాటు మహాసభలు నిర్వహిస్తారు. ప్రాంగణానికి తెనాలికి చెందిన అభ్యుదయ రచయిత బొల్లిముంత శివరామకృష్ణ పేరు, సాహిత్య సభావేదికకు నేతి పరమేశ్వరశర్మ పేరుతో నామకరణం చేశారు. సంఘం గౌరవాధ్యక్షురాలు డాక్టర్ పి.సంజీవమ్మ పతాకావిష్కరణతో మహాసభలు ప్రారంభించారు. సుప్రసిద్ధ కవి ఎస్వీ రామశాస్త్రి చిత్రించిన రచయితల ఛాయాచిత్రాలు, పుస్తక ప్రదర్శనను ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి ఆవిష్కరించారు. ప్రారంభ సభకు అరసం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి అధ్యక్షత వహించారు. సుప్రసిద్ధ అభ్యుదయ రచయిత, సాహితీవేత్త డాక్టర్ కత్తి పద్మారావు కీలకోపన్యాసం చేశారు. అఖిల భారత అరసం ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ సుఖదేవ్ సింగ్ సిర్సా ప్రారంభోపన్యాసం చేశారు. జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు స్వాగతం పలికారు.

పలు పుస్తకాల ఆవిష్కరణ..

'నూరేళ్ల తెనాలి రంగస్థలి' పుస్తక రచయిత నేతి పరమేశ్వరశర్మపై రూపొందించిన 'క్రాంతి శర్మ' పుస్తకాన్ని ఆహ్వాన సంఘం అధ్యక్షుడు డాక్టర్ సాయిమాధవ్ బుర్రా ఆవిష్కరించారు. అమరావతి మిర్రర్ మహాసభల ప్రత్యేక సంచికను జి.ఓబులేసు ఆవిష్కరించారు. సంజీవమ్మ రచన 'జీవని', మందలపర్తి కిషోర్ రాసిన 'ఇరవైలో అరవై' (అభ్యుదయ సాహిత్య చరిత్ర), బంగారు వీవీ ఆచార్యులు రచించిన 'బంగారు సాక్షలో' కోసూరి రవికుమార్ కవితా సంపుటి 'దాపల' పుస్తకాలను మహాసభలో ఆవిష్కరించారు. సాయంత్రం రచయితల పాదయాత్ర కళాక్షేత్రమ్ నుంచి రణరంగచౌక్ వరకు కొనసాగింది. అక్కడ అమరవీరుల స్థూపాల వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమాలను జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, గోగినేని కేశవరావు, కొండముది రమేష్‌బాబు, దేవరపల్లి భవాని పర్యవేక్షించారు.

సాహిత్య మకుటధారిగా మనిషి..

అరసం 80 సంవత్సరాల ఉద్యమ ప్రస్థానంపై ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ ప్రసంగించారు. సమాజం–పరిణామాలు, మనిషి–మానవ సంబంధాలు, మానవ విలువలు, కుటుంబ సంబంధాలను సాహిత్య అజెండాలోకి తీసుకొచ్చిన అరసం, మనిషిని సాహిత్యానికి మకుటధారిగా చేసిందన్నారు. అరసం జాతీయ సమితి కార్యవర్గ సభ్యుడు వేల్పుల నారాయణ మాట్లాడుతూ అభ్యుదయ రచయితలు నేటి సోషల్ మీడియాలోనూ విస్తృతంగా భాగం పంచుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర అరసం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాపోలు సుదర్శన్ మాట్లాడుతూ వివిధ అంశాలపై వర్క్‌షాపులు నిర్వహిస్తామన్నారు. డాక్టర్ పి.సంజీవమ్మ, అఖిల భారత అరసం కార్యదర్శి వినీత్ తివారి, ప్రజానాట్యమండలి జాతీయ సమితి కార్యదర్శి గని మాట్లాడారు. తెలుగు సాహిత్యం – దశ దిశ అంశంపై జీఎస్ చలం అధ్యక్షతన జరిగిన చర్చల్లో ప్రముఖ సాహితీవేత్త ముత్తేవి రవీంద్రనాథ్, ప్రొఫెసర్ మేడిపల్లి రవికుమార్, ప్రొఫెసర్ కె.శ్రీదేవి మాట్లాడారు. తెలుగు భాష గమనం–గమ్యం అంశంపై చర్చలో ప్రొఫెసర్ ఎస్.ఈశ్వరరెడ్డి, సత్యాజీ, సాకం నాగరాజు యువశ్రీ మురళి పాల్గొన్నారు.

దాంపత్య మధురిమ

స్త్రీ, పురుషుడికి వివాహ బంధం మీద నమ్మకం ప్రధానం. ఒకరికొకరై ముందుకు సాగే ఈ అద్భుత ప్రయాణంలో ఎన్నో పరమపద సోపానాలు ఎదురవుతాయి. తట్టుకోవాలి.. పట్టుకుని నిలబడాలి.! వివాహాలకు అనువైన మాసం మాఘం. ప్రస్తుతం ఆ మాసం జరుగుతుండటం.. పలుచోట్ల భాజాభజంత్రీలు మోగుతున్న శుభతరుణంలో ఈ మధ్య.. మన మధ్య కనిపించిన ఓ భార్యాభర్తల అనురాగ బంధాన్ని గుర్తు చేసే అంశం.. కొత్త దంపతుల కోసం.. స్ఫూర్తినివ్వడం కోసం..

– గుంటూరు డెస్క్

- మాఘ మాసంలో మోగుతున్న పెళ్లి భజంత్రీలు
- ఒక్కటవుతున్న వందల నూతన జంటలు
- బలంగా భారతీయ వివాహ వ్యవస్థ



సండే స్పెషల్

పతి దేవుని మురిపించే వలపుల వీణ, జీవితాన్ని పండించే నవ్వుల వాన, కష్ట సుఖాల్లో తోడునీడగా సాగుతూ తల్లిని మరిపించే ఇల్లాలి ఆదరణ దొరికిన పురుషుడి అదృష్టం అందులేనిది. 'తలమీద చేయి వేసి ఒట్టుపెట్టినా/తాళిబొట్టు మెడను కట్టి బొట్టు పెట్టినా / సన్నికల్లు తొక్కినా / సప్తపదులు మెట్టినా / మనసు మనసు కలవడమే / మంత్రం పరమార్థం' అని ఓ సినీ కవి రాసింది దంపతులు కలకాలం కలసి ఉండటానికే. ఇంకొకాయన మరో అడుగు ముందుకు వేసి 'ఒక ఒంట్లోనే కాపురమున్నా శివుడూ పార్వతీ, తనువులు రెండు తామొకటైనా సీతారాములు.. మీకు శతమానంభవతి' అంటూ పాటలోనే ఆశీర్వచనమిప్పించి అందర్నీ మెప్పించారు ఆనాడు.

దంపతులు 'వేదం–నాదంలా, వెలుగు–దీపంలా, హారం–దారంలా, క్షీరం–నీరంలా' ఉండాలన్నది కవి ఆకాంక్ష. అసలు 'ఆలూమగలు అంటే ఒకరికొకరు పూరించుకునే ఖాళీలు' అని మహాకవి ఆరుద్ర పేర్కొంటారు. సంసార రథానికి రెండు చక్రాలు భార్య–భర్త. పురుషుడికి పెళ్లితో బ్యాచిలర్ డిగ్రీ పోయినా భార్యకు మాస్టర్ డిగ్రీ వస్తుందనే గడుగ్గాయి భర్తలున్న ఈ కాలంలో ఇంకా విశ్వమంతటికీ మన హిందూ/భారతీయ వివాహ వ్యవస్థే ఆచరణీయమూ, అనుసరణీయమవుతోంది నేటికీ. కన్యాదానం వేళ 'ధర్మేచ / అర్థేచ / కామేచ / త్వయేషా నాతిచరామి' అంటూ మామగారు చెబుతుంటే వరుడు 'నాతిచరామి' అంటూ సభాముఖంగా హామీ ఇచ్చింది మేమిద్దరమూ కలసి కలకాలం ఉంటామనే. 'కార్యేషు దాసి / కరణేషు మంత్రి / భోజ్యేషు మాతా / శయనేషు రంభా' అని చెప్పుకుంటే సరిపోదు. పతిని వలపులతో, అత్తమామలను సేవలతో, అతిథులను అణకువతో, బిడ్డలను ప్రేమతో చూసుకున్న ఇంటి ఇల్లాలిని ఏ భర్తమాత్రం మరచిపోతాడు చెప్పండి. ఆహారం, బలం, యజ్ఞయాగాది క్రతువులు, సౌభాగ్యం, పశువృద్ధి రుతుసంపద, సత్సంతానం.. వంటివన్నీ తనకందించి.. తన పేరు ప్రతిష్టతో పాటు వంశాభివృద్ధికి పాటుపడిన ఇల్లాలి సేవలు ఈ జగతిలో వెలకట్టడం ఏ మగవాడికైనా సాధ్యమయ్యే పనేనా?

తొలిదశలో ఆకర్షణగా, మలిదశలో అనురాగంగా, జీవిత చరమాంకంలో ఒకరికొకరు తోడుగా సాగే ఆ దాంపత్యం ఎప్పటికీ దేదీప్యమానమే. అందరూ భార్య అంటే బరువనుకుంటారు. ఎన్నెన్నో పెదవి విరుపులతో మాట్లాడుతుంటారు. కానీ భార్య అంటే బరువు కాదు.. పరువు అని చెబుతారు ఓ అవధాని. అందుకేకదా యక్షుడు ధర్మరాజుని 'పురుషుడికి దైవం అనుగ్రహించే స్నేహితుల్లో ముఖ్యులు ఎవరు' అని అడిగితే ఆయన తడుముకోకుండా చెప్పిన రెండక్షరాల పదం 'భార్య'.

ఓ సినిమాలో 'పెళ్లిచేసుకుని, ఇల్లుచూసుకుని, చల్లగా కాలం గడపాలోయి, మీరెల్లరి భాగ్యం చూడాలోయి' అని చెప్పింది గృహస్థాశ్రమ ధర్మం చాలా గొప్పదన్న భావనతోనే. అంతెందుకు, గృహస్తుడిని ఆశ్రయించి ఎందరో ఉంటారట. సన్యాసి, అతిథులు, జీవరాశులు.. ఇలా అంతా గృహస్తుడిచ్చే ఆహారం కోసం ఎదురుచూస్తారట. భార్య లేకుంటే పురుషుడు ఏ శుభకార్యం కూడా చేయడానికి అర్హతే లేదని చెబుతోంది వేదం.

భార్య అంటే కేవలం వాంఛలు తీర్చుకోవడానికో, వండి వార్చడానికేనని లెక్కలు గట్టుకునే షరాబులున్న కాలమిది. కానేకాదు 'మగువేగా మగవాడికి మధురభావన' అన్న దాశరథి మాటల్లోని పరమార్థం వేరు. అసలు కుటుంబానికి మ్రాను భార్యేనట. కొమ్మలు సంతానంగా భావించాలట. ప్రధానంగా మన వివాహంలో 'అభివర్ధతాం పయసాభిరాష్ట్రేణ వర్ధతాం రయ్యా, సహస్ర పోషసే మౌకాస్తా మనపేక్షితా' అంటూ పెద్దల ఆశీర్వదిస్తారు. అంటే ఈ దంపతులిద్దరూ పాడిపంటలతో, గృహాలతో, భూములతో, సంపదలు, సకల సౌభాగ్యాలతో తులతూగుతూ మాకందరికీ అభివృద్ధినీ, ఆనందాన్ని కలిగించాలి. దేనికీ వీళ్లిద్దరూ ఇతరులపై ఆధారపడకుండా జీవనం సాగించాలన్నదే వారి కాంక్ష. అసలు పెళ్లెందుకు చేసుకోవాలో ఈ శ్లోకంలో పెద్దలు చెప్పకనే చెప్పారు నాడు. 'జాయమానో వై బ్రాహ్మణ స్త్రీభిఋణ వా జాయాతే, బ్రహ్మచర్యేణ ఋషిభ్యో, యజ్ఞేన దేవేభ్యః, ప్రజయా పితృభ్య ఏషవా నృణో యఃపుత్రే యజ్వా' అని. అంటే, మనిషి మూడు రుణాలతో పుడతాడట. మొదటిది రుషి రుణం, రెండవది దేవ రుణం, మూడవది పితృరుణం. మూడవది తీరాలంటే ఎవరైనా తప్పనిసరిగా వివాహం చేసుకుని తీరాల్సిందే.

ఇక సంసారంలో ప్రణయ కలహాలు, ప్రళయ కలహాలు సహజమే. అవి లేకుంటే సంసారంలో ఇంపు ఉండదన్నది అనుభవజ్ఞుల మాట. రేపు మన వివాహమైన రోజు వేడుక ఎలా చేసుకుందామని అర్థాంగి అడిగితే 'ఆ! ఏముందే, లేచి రెండు నిమిషాలు మౌనం పాటిస్తే సరిపోతుందన్న' భర్తను ఏ భార్య మాత్రం ఆరాధిస్తుంది చెప్పండి. అందుకే పెద్దలు ఊరికే అన్లేదు.. 'తాడు లేని బొంగరం / జోడు లేని జీవితం వ్యర్థమని'. సుముహూర్త బలమో, పురోహితుడి ఆశీఃపూర్వక వరమో తెలియదు కానీ ఇవాల్టికీ దంపతులు భువిపై ఎందరికో ఆదర్శంగా ఉంటున్నారంటే కారణం మన వివాహ వ్యవస్థ అంత పవిత్రమైంది కాబట్టే.



మహిళ విగ్రహం (ఫైల్)

దూరమైనా.. తరగని దగ్గర

దంపతుల్లో ఒకరు గతించినా వారి మధ్య సహజీవన సౌందర్యం వెల్లివిరుస్తూనే ఉందనడానికి కర్ణాటకలో ఓ భర్త తన భార్య విగ్రహాన్ని తయారు చేయించి కొత్తగా కట్టుకున్న ఇంట్లోకి తనతో పాటుగా గృహప్రవేశం చేయించిన ఫొటోలు, వీడియోలు ప్రసార మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. ఓ సంవత్సరం పాటు విగ్రహ తయారీకి సమయం పట్టినా, లక్షల్లో ధనం ఖర్చయినా వెనుకాడలేదాయన. తన హృదయ స్థానంలో ఉన్న పట్టమనిషిని యథాతథంగా తయారు చేయించుకుని వాటికి సొబగులు అద్దుతూ, కొత్త ఇంట్లో తన బిడ్డలతో కలసి ఆమెకు (విగ్రహానికి) సపర్యలు చేస్తున్న ఫొటోలు ఎందరికో ఆదర్శవంతమయ్యాయి. రోడ్డు ప్రమాదం ఆయనకు భార్యను దూరం చేసినా మనసులో నుంచి మాత్రం దూరం చేయలేకపోయిందన్న దానికి ఈ విగ్రహమే ఉదాహరణ. ఊర్ధ్వలోకాలకు ఇల్లాలు సాగిపోయినా ఇంకా మా మధ్యనే ఆమె జీవించి ఉందని లోకానికి చాటిన ఆయన ఎందరికో ఆదర్శనీయుడు.

క్లుప్తంగా

స్త్రీ విద్యను ప్రోత్సహించిన మహనీయుడు సదాశివరావు



మాట్లాడుతున్న జస్టిస్ చలమేశ్వర్

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): స్త్రీ విద్యను ప్రోత్సహించిన మహనీయుడిగా డాక్టర్ సదాశివరావు నిలిచారని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్ అన్నారు. లోక్‌నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరుకు చెందిన ప్రజా వైద్యుడు డాక్టర్ కాసరనేని సదాశివరావు శతజయంతి ఉత్సవాన్ని నిర్వహించారు. ఏయూలోని హిందీ భవన్ వేదికగా శనివారం ఈ కార్యక్రమంలో జస్టిస్ చలమేశ్వర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం ప్రజా వైద్యానికే సదాశివరావు తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. సమాజం పట్ల, ప్రజల పట్ల బాధ్యత కలిగిన సదాశివరావు వంటి వ్యక్తులు రాజకీయాల్లో రాణించకపోవడం ప్రజలకే నష్టమన్నారు. ఆయన సేవలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. తాత్కాలిక తాయిలాలకు ఓటర్లు ఆశపడటం దేశంలో పరిపాటి అయిపోయిందన్నారు. దీర్ఘకాలంలో ప్రజలు వారికి ఏమీ కావాలో ఆలోచించే ధోరణి కొరవడుతోందన్నారు. సమాజ అభివృద్ధికి ఇది మంచిది కాదన్నారు. అనాదిగా వస్తున్న ఈ సంస్కృతిని రూపుమాపాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మాజీ ఎమ్మెల్యే రహమాన్, ఏఎస్‌యూ మాజీ వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్ పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్‌కు 77 మంది

గుంటూరు వెస్ట్(క్రీడలు): నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీలకు 77 మందిని ఎంపిక చేసినట్లు ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ లాల్‌వజీర్ తెలిపారు. శనివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు హరియాణాలోని కురుక్షేత్రంలో నిర్వహించనున్న పోటీలకు ఈ నెల 13న విజయవాడ నుంచి బయలుదేరుతారని చెప్పారు. సమావేశంలో కార్యదర్శి ఎం.రవి, నిర్వహణా కార్యదర్శి షేక్ నజీర్, సుబ్బారావు, వై.లక్ష్మి, కాలేషావలి పాల్గొన్నారు.

తీరంలో 'వల' జడి

- వలలు ధ్వంసం చేశారంటూ స్థానిక మత్స్యకారులు ఆరోపణ
- బోటులు నిలిపివేతతో మత్స్యకారుల మధ్య చెలరేగిన వివాదం
- పోలీసులు, నాయకుల సమక్షంలో సమస్య పరిష్కారం



సముద్రంలో మత్స్యకారులు నిలిపి ఉంచిన వాడరేవు బోట్లు

చినగంజాం: సముద్రంలో సరిహద్దుల వివాదాలను పరిష్కారం చేయడం అధికారులకు తలనొప్పిగా మారుతోంది. హద్దుల వివాదం శనివారం చినగంజాం మండల పరిధిలో చోటు చేసుకోగా పోలీసులు, మత్స్యకార సంఘాల నాయకుల జోక్యంతో సద్దుమణిగింది. ఇంకొల్లు సీఐ వీ సూర్యనారాయణ అందించిన వివరాలు.. మండలంలోని రుద్రమాంబపురం గ్రామానికి చెందిన సముద్ర తీరం హద్దులో వాడరేవుకు చెందిన బోటులు హద్దులు దాటి వచ్చి వేట చేయడంతో పాటు, తీరంలో వారు వేట చేసేందుకు ఉంచిన వలలను ధ్వంసం చేశారు. లక్షల రూపాయిలు విలువ చేసే మా వలలను ధ్వంసం చేశారంటూ వారు వేట చేసేందుకు వచ్చిన వాడరేవుకు చెందిన రెండు బోటులను తిరిగి వెళ్లనీయకుండా స్థానిక మత్స్యకారులు నిలిపివేశారు. దాంతో వాడరేవుకు చెందిన మత్స్యకారులు సుమారు 25 బోట్లకు పైగా రుద్రమాంబపురంలోని తీరంలోనికి వచ్చి స్థానిక మత్స్యకారులతో వివాదానికి దిగారు. దాంతో మత్స్యకార రాష్ట్ర నాయకులను పిలిపించుకొని చర్చలు జరిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు అప్రమత్తమై గట్టి పోలీస్ బందోబస్తు మధ్య ఇరువర్గాలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి మాట్లాడారు. సీఐ వీ సూర్యనారాయణ, ఎస్‌ఐ కట్టా అనూక్, రాష్ట్ర మత్స్యకారుల సంఘాల నాయకులు, పెద్దల సమక్షంలో సమస్యను పరిష్కరించారు. వలలు నష్టపోయిన రుద్రమాంబపురం మత్స్యకారులకు నష్ట పరిహారం చెల్లించేందుకు వాడరేవుకు చెందిన మత్స్యకారులు అంగీకరించడంతో సమస్య పరిష్కారం అయినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం రాష్ట్ర నాయకుడు గొల్లపోతు నాగార్జున, వాడరేవు మత్స్యకారుల సంఘం నాయకుడు సువార్తరావు, రుద్రమాంబపురం మత్స్యకార నాయకుడు వీరభద్రం పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యాలకు పెద్దపీట

- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని
- కోటప్పకొండకు వెళ్లే రోడ్ల మరమ్మతులు పరిశీలన



రోడ్డు మరమ్మతులు పరిశీలిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేటటౌన్: కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగానిదేనని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. శనివారం ఆమె పురుషోత్తమపట్నంలో నిర్మించనున్న ప్రభ పనులకు పూజలు చేసి ప్రారంభించారు. ఈ నెల 18వ తేదీ శివరాత్రి పండుగను పురస్కరించుకొని కోటప్పకొండ తిరునాళ్ల నేపథ్యంలో చిలకలూరిపేట నుంచి కొండకు వెళ్లే రోడ్లను మంత్రి విడదల రజిని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తిరునాళ్లకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని, వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు.

14కల్లా పనులు పూర్తికావాలి..

ఈ నెల 14వ తేదీకల్లా రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చిచెట్లను తొలగించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. అక్కడక్కడా నిర్మిస్తున్న కల్వర్టు పనులను వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. ఎన్‌డీబీ నిధులతో ఇప్పటికే చిలకలూరిపేట నుంచి కోటప్పకొండకు వెళ్లే రహదారిని అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో ఆయా పనులు ఈ నెల 14 నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. 24 గంటలు పనిచేసి అయినా సరే నిర్ణయించిన సమయానికి రోడ్లు, వంతెనల నిర్మాణం పూర్తి చేయాలని సిబ్బందికి స్పష్టం చేశారు. ఎక్కడా ట్రాఫిక్ సమస్య తలెత్తడానికి వీలు లేదని పోలీసు సిబ్బందికి సూచించారు. వాహనాల మళ్లింపు పకడ్బందీగా ఉండాలని చెప్పారు. గత ఏడాది చిలకలూరిపేట రోడ్డులో ఎలాంటి ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసులు బాగా పనిచేశారని, అదే వ్యూహాన్ని ఈసారి కూడా అమలు చేయాలని సూచించారు. అధికార యంత్రాంగం బాగా పనిచేసిందని, ప్రజలు మెచ్చుకునేలా పనితీరు ఉండాలన్నారు. చిలకలూరిపేట, కట్టుబడివారిపాలెం రహదారిలో జంగిల్ క్లియరెన్స్ పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. పురుషోత్తమపట్నం సమీపంలో హైటెన్షన్ తీగల వల్ల ప్రభలకు ఎటువంటి ఆటంకం కలుగకుండా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట డీఎస్పీ విజయభాస్కరరెడ్డి, రెవెన్యూ, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బాలికను మోసగించిన కేసులో వ్యక్తి అరెస్టు

- పోక్సో కేసు నమోదు
- సీఐ సూర్యనారాయణ వివరాలు వెల్లడి



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ సూర్యనారాయణ, ఎస్‌ఐ నాయబ్ రసూల్

ఇంకొల్లు(చినగంజాం): బాలికను కిడ్నాప్, లైంగిక దాడి ఘటన నిందితుడిని శనివారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఇంకొల్లు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వీ సూర్యనారాయణ వివరాలు వెల్లడించారు. చీరాల పట్టణానికి చెందిన చవట హేమంత్, చీరాల ఆదినారాయణపురంలో ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న బాలికను మాయ మాటలు చెప్పి గడచిన ఎనిమిది నెలలుగా బాలిక వెంట తిరుగుతూ వేధిస్తున్నాడు. ఇది గమనించిన బాలిక తల్లి ఇంకొల్లులోని అమ్మమ్మ ఇంటి వద్దకు పంపింది. బాలిక ఆచూకీ తెలుసుకున్న హేమంత్ ఈనెల 1వ తేదీన ఆమెను బలవంతంగా మోటారు సైకిల్‌పై ఎక్కించుకొని తీసుకొని వెళ్లాడు. బాలిక బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈనెల 2వ తేదీ ఇంకొల్లు ఎస్‌ఐ ఎస్‌కే నాయబ్ రసూల్ కేసు నమోదు చేశారు. 8వ తేదీ బాలికను తీసుకొచ్చి విచారించగా ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈనెల 10వ తేదీ నిందితుడు హేమంత్‌ను అదుపులోనికి తీసుకున్నారు. అతడు ఉపయోగించిన మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని, నిందితుడిని కోర్టులో హాజరుపరచినట్లు చెప్పారు. కోర్టు రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు ఘర్షణలకు దిగుతుంటే మీరేం చేస్తున్నారు

- చినకోండ్రుపాడు జడ్పీ పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులను ప్రశ్నించిన ఆర్జేడీ, డీఈఓ
- మెమోలు జారీ చేస్తామని హెచ్చరిక



హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఆర్జేడీ సుబ్బారావు, డీఈఓ శైలజ

చినకోండ్రుపాడు (ప్రత్తిపాడు): పిల్లల ప్రవర్తన బాలేనప్పుడు, మీరు చెప్పినా వినడం లేదనుకున్నప్పుడు.. తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలి కదా..? అది కూడా మేం వచ్చి చెప్పేవరకూ చెయ్యరా.. స్టోరీలు చెప్పడం మానుకోండి అంటూ డీఈఓ శైలజ హెచ్‌ఎంపై మండిపడ్డారు. చినకోండ్రుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు కర్రలతో కొట్టుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనపై శనివారం స్థానిక పాఠశాలలో ఆర్జేడీ సుబ్బారావు, డీఈఓ శైలజతో కలిసి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ ఘటనపై ప్రాథమిక విచారణ నిర్వహించామని చెప్పారు. ప్రధానోపాధ్యాయుడితో పాటు ఉపాధ్యాయులందరికీ మెమోలు జారీ చేస్తున్నామన్నారు. మరోసారి పాఠశాలలో ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే అందరినీ ఇక్కడి నుంచి బదిలీ చేస్తామని హెచ్చరించారు.

ఉపాధ్యాయులపై ఆగ్రహం..

తరగతి గదుల్లోని విద్యుత్ బోర్డులు పగిలిపోయి అస్తవ్యస్తంగా ఉండటంపై హెచ్‌ఎం సలోమాన్‌ను డీఈఓ ప్రశ్నించారు. విద్యార్థులు పగలగొట్టారని హెచ్‌ఎం చెప్పడంతో డీఈఓ అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థులు పగలగొడుతుంటే మీరేం చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఇదే బడిలో విద్యార్థులు బల్లలు, తలుపులు, విద్యుత్ బోర్డులు, ఫ్యానులు ధ్వంసం చేయడం, ఓ విద్యార్థిని బ్లేడ్‌తో కోయడం వంటి ఘటనలు జరిగాయన్న విషయాన్ని స్థానికులు ఆర్జేడీ, డీఈఓల దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న జి.ప్రతాప్ రెడ్డిపై డీఈఓ ఫైర్ అయ్యారు. ఈయనను కొద్ది నెలల కిందట స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ జిల్లా సెక్రటరీగా నియమించారు. ఈ నేపథ్యంలో ఆయన పాఠశాలకు రావడం లేదంటూ హెచ్‌ఎం సలోమన్ డీఈఓకు ఫిర్యాదు చేశారు. దీంతో డీఈఓ శైలజ పీఈటీకి ఫోన్ చేశారు. ఏం తమాషాలు చేస్తున్నారా? ప్రతి రోజూ స్కూల్‌కు వెళ్లాలని చెప్పినా వెళ్లరా.. ఇక ఇదే రిపీట్ అయితే సస్పెండ్ చేసి పడేస్తా.. అర్థగంటలో స్కూల్‌లో ఉండాలంటూ వార్నింగ్ ఇచ్చారు. వారి వెంట ఎంఈఓ రమాదేవి ఉన్నారు.